క్లుప్తంగా

వివరాలు అందజేయాలి

దుమ్ముగూడెం : దుమ్ముగూడెం సొసైటీలో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు ఈ నెల 27 లోగా ఆధార్ కార్డ్, పట్టా పాస్‌బుక్ , డీసీసీబీ అకౌంట్ జిరాక్స్‌లు, ఫోన్ నంబర్లను సొసైటీ కార్యాలయంలో అందజేయాలని సీఈఓ ముత్తయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న 2 లక్షల రుణ మాఫీ పథకం కోసం రైతులు తప్పనిసరిగా సంబంధిత వివరాలు అందజేయాలని పేర్కొన్నారు.

నేడు మెగా క్రాప్‌లోన్ మేళా

ములకలపల్లి: ఎస్‌బీఐ ములకలపల్లి శాఖ ఆధ్వర్యంలో శనివారం మెగా క్రాప్‌లోన్ మేళా నిర్వహిస్తున్నట్లు మేనేజర్ రాజేంద్రనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించే ఈ మేళాలో రైతులకు పంట రుణాల మంజూరు, పాత రుణాల రెన్యూవల్ చేయబడతాయని పేర్కొన్నారు. ఖాతాదారులు తమ వెంట ఆధార్‌కార్డు, బ్యాంక్‌ఖాతా పుస్తకం , పట్టాపాస్ బుక్ జిరాక్స్‌లు తెచ్చుకోవాలని సూచించారు. మండలపరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గ్రావెల్ తోలకాలపై విచారణ చేపట్టాలి

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామంలో ఇసుక ర్యాంపు నిర్మాణానికి అక్రమంగా వినియోగించిన గ్రావెల్ తోలకాలపై విచారణ చేపట్టాలని ప్రజాపంథా మండల కార్యదర్శి దాసరి సాయన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలోని గ్రావెల్‌ను అనుమతులు లేకుండా తోలకం చేశారని వెంటనే విచారణ చేపట్టాలని కోరారు.

బ్యాంక్ మేనేజర్‌పై చర్య తీసుకోవాలి

ములకలపల్లి : గిరిజన మహిళలకు ఆసరా పెన్షన్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ఏపీజీవీ బ్యాంక్ ములకలపల్లి శాఖ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సేన నాయకులు సోడె శ్రీను డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలపరిధిలోని వీకే. రామవరం గ్రామానికి చెందిన సోడె వెంకటమ్మ భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందగా అప్పటి నుంచి పింఛన్ వస్తోందని, కానీ మూడేళ్లుగా వెంకటమ్మ పింఛన్ నిలిపివేసి, రుణం కింద జమ చేశారని ఆరోపించారు. ఇటీవల రెండు నెలల పింఛన్ ఇచ్చి, మళ్లీ ఐదు నెలలుగా నిలిపివేసి, అకౌంట్ హోల్డ్‌లో పెట్టారని ఆరోపించారు. ఈ మేరకు బ్యాంకుకు వెళ్లిన వెంకటమ్మను మేనేజర్ దుర్భాషలాడారని ఆరోపించారు. న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ పుల్లారావుకు, పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.
ఈ విషయమై ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ భరత్ క్రాంతిని వివరణ కోరగా తాను ఎవరినీ దుర్భాషలాడలేదని, సదరు మహిళ అకౌంట్ హోల్డ్‌లో పెట్టలేదని తెలిపారు.

ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న సతీష్‌కుమార్

చర్ల: మండలంలోని రాళ్లగూడెంలో పలు నిరుపేద కుటుంబాలకు శుక్రవారం హైకోర్టు అడ్వకేట్ సీవీ సతీష్‌కుమార్ ఆర్థిక సాయాన్ని అందజేశారు. చర్లకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు సీవీకేరావు కుమారుడు సీవీ సతీష్ హైకోర్టులో అడ్వకేట్‌గా పని చేస్తూ పలు కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.

అవినీతి అధికారుల ఆస్తులపై విచారణ చేపట్టాలి

చర్ల: అవినీతి అధికారుల ఆస్తులపై సీబీఐతో విచారణ జరిపించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఆర్ కొత్తగూడెం పంచాయతీలోని సున్నంగుంపులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా, డిప్యూటీ తహసీల్దార్‌గా రెండేళ్లపాటు పని చేసిన భరణిబాబు ఒకరి పేరున ఉన్న పట్టాలు మరొకరి పేరున మార్పు చేసి పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకున్నారన్నారు. ఈయన అవినీతి వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తా..

గుండాల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనని గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలను పరిష్కరిస్తానని ఖమ్మం నల్గొండ వరంగల్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి తేజావత్ వాసుదేవ్ అన్నారు. ఈ మేరకు ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా గుండాల మండలంలో శుక్రవారం పర్యటించిన అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కష్టాల రేవు..!

మారని రజకుల బతుకులు

- కానరాని ధోబీఘాట్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


పోలకమ్మ తోగులో బట్టలు ఉతుకుతున్న రజకులు


ఇస్త్రీ చేస్తూ..

కరకగూడెం: రోజుల గడుస్తున్నా ప్రభుత్వాలు మారుతున్నా రజకులు జీవితాల్లో మార్పు రావడం లేదు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా రజకుల అభివృద్ధి జరగడం లేదు. కులవృత్తినే నమ్ముకుని బతుకుతున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో ధోబీ ఘాట్లను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో రజకులు దుస్తులు ఉతకడానికి నానాకష్టాలు పడుతున్నారు. మండలంలోని కరకగూడెం, సీతారాంపురం, చిరుమళ్ల, లక్ష్మీపురం, అనంతారం తదితర గ్రామాల్లో రజకవృత్తిని నమ్ముకుని అనేక కుటుంబాలను పోషించుకునే వారు దాదాపు వందల సంఖ్యలో ఉన్నారు.

ప్రస్తుత ప్రభుత్వంపై ఆశలు...
నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంపైన రజకులు భారీ ఆశలు పెట్టుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇస్త్రీ చేసే రజకులకు నెలనెలా 250 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అమలు చేయడంతో పాటు మరికొంత మందికి రూ.లక్ష రూపాయల బీసీ లోన్ ఇచ్చారు. అంతకుముందు ఇస్త్రీ చేసే వారికి బొగ్గు, కిరోసిన్ కోసం ప్రతీ నెలా దాదాపు రూ.1,200 నుంచి రూ.1,800 వరకు ఖర్చయ్యేది. కానీ నాటి తెలంగాణ సర్కారు వారికి ఉచిత విద్యుత్ ఇస్తుండడంతో ఆ ఖర్చు మిగిలి ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. అదేవిధంగా ధోబీ ఘాట్లు నిర్మిస్తే ఎంతో మేలు జరుగుతుందని రజకులు కోరుతున్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి, 50 ఏళ్లు నిండిన రజక వృత్తిదారులకు నెలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని, రాయితీపై రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

వాగులు, వంకలే ఆధారం..


బట్టలు మోసుకెళ్తున్న మహిళ

రజకులు ఇంటింటికి వెళ్లి ఉతికే దుస్తులను సేకరించి వాటిని స్థానికంగా ఉన్న చెరువులు, తోగులు, వాగులు, వంకల వద్ద ఉతుకుతున్నారు. ప్రభుత్వం కనీసం ధోబీఘాట్లు ఏర్పాటు చేయకపోవడంతో రజకుల దీనస్థితికి అద్దం పడుతోంది. మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రజక వృత్తిలోకి ఇతరులు రావడంతో వీరి జీవన స్థితిగతుల్లో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. సంప్రదాయ పద్ధతిలో రజకులు అందించే సేవలను ఇతర కూలాల వారూ నిర్వహించడంతో రజక వృత్తిదారుల వృత్తి పని తగ్గిపోతుంది. బహుళజాతి సంస్థలు రెడీమేడ్ దుస్తువులను, ఉతికే యంత్రాలను మార్కెట్లోకి తీసుకురావడం వల్ల ఇతర కులాలకు చెందిన వారు ఇస్త్రీ, డ్రైక్లీనింగ్ వంటి సేవలు అందించే షాపులను నిర్వహించడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోతున్నారు.

స్థితిగతుల్లో మార్పురాలేదు...



ప్రభుత్వాలు మారిన రజకుల స్థితిగతుల్లో మార్పురాలేదు. రోజురోజుకు మా బతుకులు దుర్భరంగా మారుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కమ్యూనిటీ హాళ్లలాగ నిర్మించి ఇస్త్రీ షాపులకు రుణాలు మంజూరు చేయాలి, 50 సంవత్సరాలు దాటిన వారికి వృద్ధాప్య ఫించను అందించాలి.

– మోసంగి వెంకన్న, కరకగూడెం

ప్రభుత్వాలు గుర్తించాలి



నామినేటెడ్ పోస్టుల భర్తీలో రజకులకు సముచిత న్యాయం కల్పించాలి. రజకుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి రాయితీపై రుణాలు ఇవ్వాలి. రజకులు కులవృత్తి మీద ఆధారపడి బతికే పరిస్థితి లేదు. వారికి విద్య, ఉపాధి అవకాశాలను, తగు శిక్షణను ఇచ్చి నూతన జీవన విధానంలోకి ప్రభుత్వాలు తీసుకురావాలి.

– సట్ల సతీష్, కరకగూడెం

ధోబీ ఘాట్లు నిర్మించాలి



ప్రతీ రోజు ఇంటింటికీ వెళ్లి ఉతికే బట్టలను సేకరిస్తున్నాం .సేకరించిన బట్టలను దగ్గర లోని వాగుల్లో, చెరువుల్లో ఉతుకుతున్నాం. ఇలా చేయాలంటే ఎంతో ఇబ్బందికరంగా మారింది ధోబీ ఘాట్లు ఏర్పాటు చేస్తే మా పరిస్థితుల్లో కొంచెం మార్పు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధోబి ఘాట్లు ఏర్పాటు చేయాలి.

– మాటూరి శ్రీనివాస్, కోర్సవల్లి

రైతులకు సబ్సిడీపై విత్తనాల పంపిణీ


అశ్వారావుపేటరూరల్: రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఏఈఓ షాకిరా బాను

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం, అశ్వారావుపేట సహకార సంఘాల కార్యాలయాల్లో శుక్రవారం రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఏఓ నవీన్ మాట్లాడుతూ.. నారాయణపురం సొసైటీకు జీలుగులు 40 క్వింటాళ్లు, జనుములు 60 క్వింటాళ్లు, అలాగే అశ్వారావుపేట సొసైటీకు జీలుగులు 60 క్వింటాళ్లు, జనుము విత్తనాలు 60 క్వింటాళ్ల చొప్పున అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలకు రైతులు కార్యాలయాల్లో ఉండే ఏఈవోను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ షాకిరా బాను, సొసైటీ సీఈవో విజయ్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ
దమ్మపేట: మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో శనివారం నుంచి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు, మండల వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం సొసైటీలో 249 క్వింటాల జీలుగులు, 70 క్వింటాల జనుములు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన వారు తమ పరిధిలోని ఏఈఓలకు భూసంబంధిత డాక్యుమెంట్ల జిరాక్స్ ప్రతులను అందజేసి, టోకెన్లు తీసుకోవాలని సూచించారు. టోకెన్లను సొసైటీ కార్యాలయాల్లో అందజేసి విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. 30 కిలోల జీలుగు విత్తనాల సంచి ధర రూ.1,116, కాగా 40 కిలోల జనుము విత్తనాల సంచి ధర రూ.1,448 అని పేర్కొన్నారు.

మానవత్వం చాటుకున్న తహసీల్దార్


కుక్కను నూతిలో నుంచి బయటకు తీయిస్తున్న తహసీల్దార్ రాఘవరెడ్డి

మణుగూరు టౌన్: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని వరలు వేసి మూసి వేయకుండా ఉంచిన నూతిలో ప్రమాదవశాత్తు పడ్డ కుక్క అరుస్తుండగా సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాఘవరెడ్డి స్పందించారు. ఈ మేరకు శుక్రవారం సమితిసింగారం పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఫైర్ సిబ్బంది సహకారంతో మూడు గంటలకు పైగా శ్రమించి కుక్కను బయటకు తీయించి ప్రాణాలు కాపాడారు.

తాగునీటి సమస్య పరిష్కారంలో విఫలం

దుమ్ముగూడెం : మండలంలోని అడవి రామవరం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని సీపీఎంఎల్ మాస్‌లైన్ అనుబంధం సంఘం అఖిలభారత ప్రగతిశీల రైతుసంఘం డివిజన్ అధ్యక్షుడు సున్నం వీరభద్రం అన్నారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలోని ట్యాంకు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినప్పటికీ ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో అలంకారప్రాయంగా తాగు నీటి ట్యాంకు,పైప్‌లైన్ దర్శనం ఇస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి నూపా అర్జున్, నారాయణ, కల్లూరు శంకర్, బాబురావు, సాయన్న తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

మూతబడిన పాఠశాలలను తెరిపించాలి

భద్రాచలంటౌన్: జిల్లాలోని ప్రతీ మండలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉపాధ్యాయ సంఘాలు, విద్యాభిమానులతో కమిటీలు ఏర్పాటు చేసి మూసి వేయబడిన పాఠశాలలను తెరిపించడంలో కృషి చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు, ఉపాధ్యాయదర్శిని సంపాదకవర్గ సభ్యులు రామాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రతీ తరగతికి ఒక టీచర్ ను కేటాయించాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించండి


మణుగూరు రూరల్ : ప్రచారంలో నాయకులు


కరకగూడెంలో..

అశ్వారావుపేటరూరల్/ములకలపల్లి: వరంగల్, నలగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన ఏనుగుల రాకేశ్‌రెడ్డిను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం అశ్వారావుపేట పట్టణంలో, ములకలపల్లి మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, సంకా ప్రసాద్, సత్యవరపు సంపూర్ణ, తాడేపల్లి రవి, మోటూరి మోహన్, బుజ్జిబాబు, నక్కా రాంబాబు పాల్గొన్నారు.
మణుగూరు రూరల్ : బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపు ఖాయమని జెడ్పీటీసీ పోశం నరసింహరావు అన్నారు. మండలంలోని కూనవరం, సమితిసింగారం గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ముత్యంబాబు, మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఎంపీటీసీ తాటి సరిత, మాజీ ఎంపీటీసీ కాటిబోయిన సుజాత, రైతు సంఘం మండలాధ్యక్షుడు రామసహాయం వెంకటరెడ్డి, నాయకులు వీరస్నబాబు, రామారావు, నరసింహారావు, ఏనిక వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, సురేందర్, శ్రీను, వెంకటసోములు, ఎస్ నాగభూషణం, అనంతరామిరెడ్డి, గాజుల నరేష్ పాల్గొన్నారు.
కరకగూడెం: ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని మండలంలోని గొల్లగూడెం,కొత్తగూడెం,చొప్పాల గ్రామాల్లో పట్టభద్రుల ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు రావుల సోమయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అక్కిరెడ్డి వెంకట రెడ్డి, మాజీ సర్పంచ్ పాయం నర్సింహారావు, మండల యూత్ ప్రెసిడెంట్ గుడ్ల రంజిత్, నాయకులు జివ్వాజి సమ్మయ్య, కుంజ లక్ష్మయ్య, నాగేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోళ్లలో అప్రమత్తత తప్పనిసరి

చర్ల: మండలంలో రైతులు పత్తి, మిర్చి, వరి విత్తనాలను కొనుగోలు చేసే సందర్భంలో అప్రమత్తంగా వ్యవహరించాలని మండల వ్యవసాయశాఖాధికారి పి.శివరాంప్రసాద్ సూచించారు. విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహనలో భాగంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. లైసెన్సు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పకుండా బిల్లు తీసుకోవాలన్నారు. విత్తనాలపై అనుమానం వస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

అశ్వాపురం వైస్ ఎంపీపీ ఏకగ్రీవం

- ఎన్నికైన బేతం రామకృష్ణ


వైస్ ఎంపీపీ రామకృష్ణకు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే పాయం, నాయకులు

అశ్వాపురం: మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని మల్లెలమడుగు ఎంపీటీసీ సభ్యుడు బేతం రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి పీఆర్ డీఈ సైదులురెడ్డి వ్యవహరించారు. ఈ మేరకు బేతం రామకృష్ణ ఒక్కడే నామినేషన్ వేయడంతో ఆయన్నే వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించి నియామక పత్రం అందజేశారు. రామకృష్ణ వైస్ ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కమటం నరేష్, ఎంపీటీసీలు, అధికారులు, సిబ్బంది వైస్ ఎంపీపీగా ఎన్నికైన రామకృష్ణకు అభినందనలు తెలిపారు.

సన్మానం...
ఈ మేరకు నూతన వైస్ ఎంపీపీగా ఎన్నికైన బేతం రామకృష్ణను మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, జిల్లా, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్‌కె.ఖధీర్, ఎంపీటీసీల సంఘం మండలాధ్యక్షుడు కమటం నరేష్, ఎంపీటీసీలు ఏనిక రవి, గాదె జయ, కొమరం చిట్టెమ్మ, మాజీ ఎంపీపీ ఊసా అనిల్, నాయకులు వీరభద్రారెడ్డి, సదర్‌లాల్, గాదె వెంకటేశ్వర్లు, గొల్లపల్లి నరేష్, నరసింహారావు, మోసిన్, గాలిబ్, షారూఖ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శుభాకాంక్షలు
వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ మణుగూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాద పూర్వకంగా కలిశారు. రామకృష్ణకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

త్వరలో డీఆర్‌సీసీ షెడ్డు అందుబాటులోకి..


షెడ్డును పరిశీలిస్తున్న ఈఈ మంగ్యానాయక్, ఏఈ వైష్యా నాయక్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణ వాసులు ఎన్నో ఏళ్లుగా డంపింగ్‌యార్డు లేక ఇబ్బందులు పడుతున్నారని, మరికొన్ని రోజుల్లో డీఆర్‌సీసీ షెడ్ (డ్రై వేస్ట్ రిసోర్స్ కలెక్టింగ్ సెంటర్) అందుబాటులోకి వస్తుందని పంచాయతీ రాజ్ ఈఈ మంగ్యానాయక్ అన్నారు. భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మనుబోతుల చెరువు లో నిర్మాణం పూర్తయిన డంపింగ్‌యార్డును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రూ.80 లక్షల వ్యయంతో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తయిన డీఆర్‌సీసీ షెడ్డును ఆయన పరిశీలించారు. అనంతరం డంపింగ్‌యార్డు నిర్వహణ, పూర్తి చేయాల్సి పనులు, తదితర అంశాలపై పంచాయతీరాజ్ ఏఈ వైష్యానాయక్‌తో కలిసి పంచాయతీ అధికారి శ్రీనివాస్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం గ్రామ పంచాయతీ సిబ్బంది శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పనులన్నీ వెంటనే పూర్తి చేయాలి

ములకలపల్లి: ములకలపల్లి శివారులో పాములేరు వాగుపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం పనుల పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే హోదాలో 8 నెలల క్రితం తానే భూమిపూజ చేశానని, నెలల గడుస్తున్నా పనుల్లో పురోగతి కనిపించడలేని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తాళ్లపాయ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. మూడేళ్ల క్రితం నిర్మాణాలు ఆరంభించినా, నేటికీ పూర్తవ్వకపోవడంతో ఆంతర్యం ఏమిటని ఏటీడీఏ అధికారులను ప్రశ్నించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, పుష్పాల చందర్‌రావు, శనగపాటి సీతారాములు, సున్నం బాబూరావు, బైటి రాజేష్, పుష్పాల హనుమంతు, గుంట్రు కృష్ణ, పుష్పాల సాయి తదితరులు పాల్గొన్నారు.


డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న మెచ్చా

జాతరలో పూజలు
దమ్మపేట: మండల పరిధిలోని పార్కలగండి గ్రామ శివారులో కొలువైయున్న పెద్దకొర్రాజుల స్వామి జాతర మహోత్సవంలో మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సోయం వీరభద్రం, రాజు, శ్రీరాములు, చక్రధరరావు, చంద్రశేఖర్, నరేంద్ర, కాకా శివ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి కారకులను శిక్షించాలి


భద్రాచలంటౌన్: విద్యార్థిని కారుణ్య మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు సోంది మల్లుదొర శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థి మృతి పట్ల కళాశాల యాజమాన్య వైఫల్యం స్పష్టంగా కనబడుతుందని వెంటనే ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపించి కళాశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు.
మణుగూరు రూరల్ : గిరిజన బిడ్డ కారుణ్య మృతిపై వెంటనే విచారణ చేపట్టాలని, కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యువజన మండల, పట్టణాధ్యక్షులు హర్షనాయుడు, గుర్రం సృజన్ మాట్లాడారు.మృతిపై విచారణ చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. నాయకులు రమేష్, రంజిత్, ముద్దంగుల వంశీ, సంపత్, యేషప్, భరత్ తదితరులు పాల్గొన్నారు.
అశ్వాపురం: విద్యార్థిని కారుణ్య మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు గద్దల రామకృష్ణ డిమాండ్ చేశారు. అశ్వాపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధ్యులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.


వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చర్ల రూరల్: మండలంలోని చెన్నాపురం గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురిని పరిశీలించి జ్వరంతో బాధపడుతున్న వారికి కావాల్సిన మందులను పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి.దేశప్ప, సత్యనారాయణపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి దివ్యనయన, సిబ్బంది సుబ్బారావు, వరప్రసాద్, మారుతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి


అశ్వాపురం: ప్రచారం చేస్తున్న నాయకులు


దుమ్ముగూడెం: సమావేశంలో పాల్గొన్న నాయకులు

అశ్వాపురం: ఈ నెల 27న జరగనున్న ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత ఆధ్వర్యంలో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. జిల్లా, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్కే.ఖధీర్, వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కమటం నరేష్, ఎంపీటీసీలు, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, సదర్‌లాల్, గొల్లపల్లి నరేష్ పాల్గొన్నారు.
దుమ్ముగూడెం : ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నని గెలిపించాలని భద్రాచలం నియోజక వర్గం సేవాదళ్ అధ్యక్షులు పిలక వెంకట రమణ రెడ్డి మండలంలోని లక్ష్మీనగరంలో ప్రచారం నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి పెట్టాలి
తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా చూడాలని కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. లక్ష్మీనగరం పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. కుంజ శ్రీనివాసరావు, తెల్లం హరికృష్ణ, దర్శి సాంబశివరావు, మట్ట శివాజీ, సరియం వీర్రాజు, తోటమల్ల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.
చర్ల: ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ చర్ల మండలంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, గుండేపూడి సతీష్‌కుమార్, తోటమల్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.